క్లుప్తంగా

సమ్మయ్యకు సన్మానం



దేవరుప్పుల: దేశంలో ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ పురస్కార గ్రహీత గడ్డం సమ్మయ్యను కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. సోమవారం హైదరాబాద్‌లో సీసీఆర్‌టీ కాంప్లెక్స్‌లో గానగంధర్వ ఘంటసాల శతజయంతి ఉత్సవాలు పురస్కరించుకుని భారత్ కళామండం ప్రారంభోత్సవానికి సమ్మయ్యకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సంగీత నాటక అకాడమీ, దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రం గౌరవార్థంగా జ్ఞాపికను ఇచ్చి మంత్రిచే సత్కరించినట్లు సమ్మయ్య బృంద నిర్వాహకుడు హిమగిరి తెలిపారు.

ఎంపీడీఓకు..



రఘునాథపల్లి: బదిలీపై సూర్యాపేటకు వెళ్తున్న ఎంపీడీఓ హసీంను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు మహేష్, విజయ్, నర్సింహ, సాయిబాబా, బాస్కర్, శివాజీ, కవిత, బానుప్రియ, రమాజ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ




జనగామ: నర్సంపేటలో ఆదివారం జరిగిన నేషనల్ ఇన్విటేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన న్యూ స్టార్ చైనీస్ కుంగ్‌ఫూ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినట్లు అసోసియేషన్‌రాష్ట్ర కార్యదర్శి, మాస్టర్ గుగ్గిళ్ల దేవేందర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అసోసియేషన్ వ్యవస్థాపకుడు, గ్రాండ్ మాస్టర్ ఎండీ సలీం పాషా దైవిక్, సాయి గణేష్, తనీష్ నాయక్, అభినందన్, సంకీర్తన్, అక్షిత, అఖిల తదితరులను అభినందించారు.

కథల పోటీల్లో..



బచ్చన్నపేట: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన లీలావతి ధవే సైన్స్ ఫిక్షన్ కథల పోటీలో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల 8వ తరగతి విద్యార్థి పి.సంజన ప్రతిభ కనబరిచి ప్రత్యేక బహుమతి గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంజనకు భారత రాజ్యాంగ ప్రవేశిక అనే పుస్తకాన్ని అందించి అభినందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీజేఎఫ్ జిల్లా నూతన కమిటీ నియామకం



జనగామ: డెమోక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్(డీజేఎఫ్) జిల్లా నూతన అధ్యక్షుడిగా పాల మాకుల జితేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గూడూరు లెనిన్‌ను నియమిస్తూ సంఘ జాతీయ గౌరవ అధ్యక్షుడు పి.విశ్వనాథ్, జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి సోమవారం వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన డీజేఎఫ్ జాతీయ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



చందు



నజియా

లింగాలఘణపురం: నవాబుపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జి.చందు, ఎండీ.నజియా జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన పోటీల్లో చందు షాట్‌పుట్‌లో, నజియా జావెలిన్ త్రోలో ప్రతిభ కనబర్చి ఈనెల 15న గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఆ సందర్భంగా విద్యార్థినులను హెచ్‌ఎంతోపాటు పీఈటీ అశోక్‌కుమార్ అభినందించారు.

సమ్మెను జయప్రదం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: దేశ వ్యాప్తంగా కార్మికుల కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.10వేలు చెల్లించాలనే తదితర డిమాండ్లతో ఈనెల 16న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు కోరారు. 16న జరిగే సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును గ్రామ పంచాయతీ, హమాలీ కార్మికులతో కలిసి స్థానిక మండల పరిషత్, వ్యవసాయ మార్కెట్ కార్యాలయాల్లో సోమవారం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కొడెపాక యాకయ్య, నాయకులు గుర్రం లరాజర్, ఆకుల శ్రీను, పిట్టల అశోక్, గుర్రం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: ఎంపీడీఓ శ్రీధర్‌స్వామికి సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు



జనగామ రూరల్: డీఎంహెచ్‌ఓకు..

జనగామ రూరల్: ఈనెల 16వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం పిలునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆశ కార్యకర్తల ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓకు సమ్మెనోటీసు అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడగోని రాధ, విజయ, సంధ్య, సుధ, రాణి, రజిత, సరిత పాల్గొన్నారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మంగళంపల్లి జనార్దన్,శ్రీశైలం, వీరస్వామి, మల్లేషం, మల్లయ్య, నగేష్, సదానందం పాల్గొన్నారు.

రఘునాథపల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి గంగాపురం మహేందర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లు, కార్మిక సంఘం నాయకులతో కలిసి సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్రమోదీ కార్మికులకు మేలు చేసే చట్టాలను రద్దు చేసి కార్మిక వర్గానికి తీరని నష్టం చేకూర్చాడన్నారు. భారత్‌బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సాంబరాజు, నర్సయ్య, బాబు, సుధాకర్, భాస్కర్, జనార్దన్, యాదగిరి, దావీద్, పరుశరాములు, కృష్ణ, భిక్షపతితోపాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను సవరించారు

సాక్షి ఎఫెక్ట్



విద్యుత్ తీగలను సవరిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

లింగాలఘణపురం: మండలంలోని పటేల్‌గూడెంలో పాన్నాల బుచ్చయ్య వ్యవసాయ పొలం వద్ద స్తంభం విరిగి ఒకవైపు, చేతికందే విధంగా ప్రమాదకరంగా మరోవైపు ఉన్న తీగలపై ఎట్టకేలకు సోమవారం ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సవరించారు. ఈ నెల 9న 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' పట్టించుకోని అధికారులు అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో ఏఈ శంకరయ్య స్పందించారు. లైన్‌మన్ నర్సయ్య సిబ్బందితో కలిసి విరిగిన స్తంభం స్థానంలో మరో స్తంభాన్ని పాతారు. అంతేకాకుండా కిందికి వేలాడిన తీగల మధ్య మిడిల్‌పోల్ ఏర్పాటు చేసి పైకి ఎత్తారు. నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా స్పందించని అధికారులు 'సాక్షి' కథనంతో స్పందించి సమస్యను పరిష్కరించారు.

లెదర్‌పార్క్‌పై చొరవ హర్షణీయం

స్టేషన్‌ఘన్‌పూర్: చర్మకారులకు జీవనోపాధి కల్పించే లెదర్‌పార్కుల అంశంపై బడ్జెట్ సమావేశంలో రాష్ట్ర మంత్రి భట్టి విక్రమార్క ప్రస్తావించడం, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం సర్వత్రా హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రాజారపు ప్రభు, చర్మకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాదె కుమారస్వామి అన్నారు. ఇటీవల రాష్ట్ర బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రంలో రెండు లెదర్‌పార్కులను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి భట్టి ప్రకటించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ఘన్‌పూర్ చర్మకారుల సంఘం ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఫ్లెక్సీలకు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతపురం చంద్రమౌళి, చేపూరి కుమార్, ప్రవీణ్, గుర్రం శ్రీను, జీడి యాకయ్య, రాజు, ప్రేమానందం పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/బచ్చన్నపేట: పద్మశాలీల కులదైవమైన భక్త మార్కండేయ జయంతిని జిల్లా వ్యాప్తంగా పద్మశాలీలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఘన్‌పూర్ పద్మశాలీ యువజన పరపతి సంఘం అధ్యక్షుడు గడ్డం కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘన్‌పూర్‌లో ప్రత్యేక పూజలు చేశారు. పూజారి కలకోల నరేష్ ఆధ్వర్యంలో మార్కండేయ దేవుడికి పద్మశాలీ కులస్తులు సామూహికంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గడ్డం కృష్ణమూర్తి, సంఘం బాధ్యులు సాంబారి సత్యనారాయణ, వేళ్ల సురేందర్, కూరపాటి శ్రీనివాస్, విష్ణుశంకర్, సత్యనారాయణ, సాంబశివ, చందు, భక్తులు లక్ష్మీనారాయణ, రామస్వామి, వెంకటేశ్వర్లు, రమేష్, యాదగిరి, బొడ్డున రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే జఫర్‌గఢ్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మామిడాల సోమనారాయణ, టౌన్ అధ్యక్షుడు బైరి వెంకటేశ్వర్లు, ఈరభత్తిని అంజయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, బచ్చన్నపేట మండల కేంద్రంలో, కొన్నె గ్రామంలోని మార్కండేయస్వామి ఆలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో అర్చకుడు అర్వపల్లి కృష్ణశర్మ, సంఘం నేతలు, మార్కండేయ సమితి సభ్యులు, మహిళలు పలువురు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: పూజలో పాల్గొన్న పద్మశాలీలు

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

తరిగొప్పుల: స్కూల్‌లో ఉపాధ్యాయులు ఇచ్చిన హోం వర్క్ చేయకపోవడంతో వారు కొడతారన్న భయంతో వసతి గృహం నుంచి పారిపోయిన విద్యార్థిని కనిపెట్టిన పోలీసులు బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన సోమవారం మండలకేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేశ్యతండాకు చెందిన లావుడ్య లలిత, రమేష్ దంపతుల కుమారుడు చరణ్(13) స్థానిక గిరిజన వసతి గృహంలో ఉంటూ మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కాగా సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్తున్నానని చెప్పి వసతి గృహం నుంచి బయలుదేరి ఎటో వెళ్లాడు. ఎంతకీ పాఠశాలకు రాకపోవడంతో స్కూల్ యాజమాన్యం బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్రమత్తమైన ఎస్సై నరేష్ సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించి జగ్గయ్యపేట పరిసరాల్లోనే బాలుడు తిరుగుతున్నట్లు గుర్తించారు. సిబ్బంది కనకరాజు, బాలాజి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లను బెస్ట్ అవైలబుల్ స్కీంలో చేర్చాలి

జనగామ: జిల్లాలోని ప్రముఖ ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లను బెస్ట్ అవైలబుల్ స్కీంలో చేర్చాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ పర్మర్ పింకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో చేర్పిస్తే.. ప్రతిభ ఉండి చదివించుకోలేని నిరుపేద వర్గాలకు భరోసా దొరుకుతుందన్నారు. ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా అందించే చదువును పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్ మాట్లాడుతూ దళిత, అణగారిన, పేద వర్గాల అభివృద్ధి, పిల్లల చదువు, భవిష్యత్‌ను ఆలోచించి ఇందుకు సంబంధించిన నిర్ణయాన్ని సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు. వారి వెంట సందెన రవీందర్, గువ్వల రవి తదితరులు ఉన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సరస్వతి విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

పాలకుర్తి టౌన్: మండలంలోని ఈరవెన్ను గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుల తల్లి సరస్వతీదేవి అమ్మవారి విగ్రహ ఏర్పాటుకు పూర్వ విద్యార్థులు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.లక్ష విలువతో పాఠశాలలో సరస్వతి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న పూర్వవిద్యార్థులు

ముగిసిన దర్గా ఉత్సవాలు

రఘునాథపల్లి: హిందూ–ముస్లింల ఐక్యతకు ప్రతీకగా గోవర్ధనగిరి హజ్రత్ సయ్యద్ బురాహనుద్దీన్‌షా దర్గా నిలిచిందని తహసీల్దార్ పురం యుగేందర్, ఎస్సై చాగర్ల రఘుపతి అన్నారు. రెండు రోజుల పాటు దర్గా మెనేజర్ హజ్రత్ సయ్యద్ బురాహనుద్దీన్‌షా ఆధ్వర్యంలో నిర్వహించిన 896వ దర్గా ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. తహసీల్దార్, ఎస్సై, ఎంపీపీ మేకల వరలక్ష్మితో పాటు పలువురు ప్రముఖులు దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకరి అనితశ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో తహసీల్దార్, ఎస్సై

సమస్యలు పరిష్కరించాలి



తరిగొప్పుల : తండాల్లో అనేక సమస్యలు ఉన్నాయి.. వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలని సేవాలాల్ సేన సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక గీతా ఆశ్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మూడావత్ రాజునాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంఘం మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల స్థాయి సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గుగులోత్ టోలియా, శ్రీకాంత్, సుమన్, రాందాస్, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కమిటీల ఎన్నిక



బచ్చన్నపేట: డీసీసీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బండనాగారం, లక్ష్మాపూర్ గ్రామాల్లో పార్టీ నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు మండల సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ అల్వాల ఎల్లయ్య తెలిపారు. సోమవారం కమిటీలను ఎన్నుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా ఇప్ప శ్రీధర్‌రెడ్డి, చిలుక ప్రవీణ్ ఉపాధ్యక్షులుగా శివరాత్రి సిద్దులు, నూకల క్రిష్టారెడ్డి, మానెపల్లి భూమయ్య, ఇజ్జగిరి పర్శరాములు ప్రధాన కార్యదర్శులుగా ఇమ్మడి కుమార్, మానెపల్లి బాబురావు, యూత్ అధ్యక్షుడిగా గండి సురేష్, కమిటీ సభ్యులను ఎన్నుకున్నామని తెలిపారు.

రేపు సామూహిక అక్షరాభ్యాసం

జనగామ: వసంత పంచమి పురస్కరించుకుని ఈ నెల14(బుధవారం) పట్టణంలోని బీరప్పగడ్డలోని సరస్వతీ శిశు మందిర్‌లో ఉదయం 9 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బాలనర్సయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అక్షరాభ్యాసం చేసుకునే చిన్నారులకు బాసర పుణ్యక్షేత్రం నుంచి వచ్చే కుంకుమ, జ్ఞానసరస్వతీ అమ్మవారితో పాటు హయగ్రీవ స్వామి చిత్రపటాన్ని అందిస్తామన్నారు. అక్షరాభ్యాసం చేసుకునే వారు–9441702686, 9849425114 నంబర్లను సంప్రదించాలన్నారు.

పండ్ల పంపిణీ

జనగామ: పాలకుర్తి నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు మేడిద ప్రశాంత్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని పవన్ కళ్యాణ్ హెల్పింగ్ పీపుల్స్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సోమవారం రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పీపుల్స్ హెల్పింగ్ అధ్యక్షుడు జోగు భాస్కర్, సాయిరాం, రంజిత్, దిలీప్, జోగు ఉదయ్, అశోక్, శివ, పృథ్వి, మను, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు 1993–94 పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.1లక్షతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించిన్నందుకు పాఠశాల విద్యార్థులు పూర్వ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

కొడకండ్ల: గడిచిన ఐదేళ్లలో గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకపాత్రను పోషించారని ఎంపీపీ జ్యోతి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మాజీ సర్పంచ్‌లను జెడ్పీటీసీ సత్తమ్మతో కలిసి ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి గ్రామాల్లో నూతన శోభను సంతరింపజేశారని, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, మార్కెట్ చైర్మన్ రాము, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, సొసైటీ వైస్ చైర్మన్ సోమరాములు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేతనాలు అందించి ఆదుకోండి

కొడకండ్ల: కొడకండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని యూనియన్ నాయకులు మైమూదాభేగం, అరుణ, సరిత, సువర్ణ, ఉప్పలక్ష్మి, మంజులలు ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం డిసెంబర్, ఈ సంవత్సరం జనవరి నెలలకు సంబంధించిన వేతనాలు ఇంకా రాలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం స్పందించి వేతనాలు అందించి ఆదుకోవాలని వారు కోరారు.

బాధ్యతల స్వీకరణ

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: పాలకుర్తి సీఐగా జి.మహేందర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా బాధ్యతలు స్వీకరించిన సీఐ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

విధుల్లో చేరిన ఎస్సై సాయిప్రసన్న కుమార్

పాలకుర్తి ఎస్సైగా మోడెం సాయిప్రసన్న కుమార్ సోమవారం విధుల్లో చేరారు. ఇప్పటివరకు పనిచేసిన ఎస్సై లింగారెడ్డి నూతన ఎస్సైకి పుష్పగుచ్ఛం అందజేసి బాధ్యతలను అప్పగించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిప్రసన్న మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి

దేవరుప్పుల: శాంతి భద్రతల పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎస్సై ఎస్.చెన్నకేశవులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో ప్రస్తుతం విధులు నిర్వర్తించే ఎస్సై కొంగరి శ్రవణ్‌కుమార్ బదిలీపై వెళ్లగా హనుమకొండలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై చెన్నకేశవులు బదిలీపై ఇక్కడి బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరిన ఎస్సైని వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, గిరిజన నాయకుడు కోటి, గేమా శాలువతా సత్కరించారు.

పుస్తెమెట్టెలు అందజేత

బచ్చన్నపేట: మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది పద్మ నాగయ్య దంపతుల కూతురు కళ్యాణి వివాహానికి మాజీ సర్పంచ్ తాటిరెడ్డి భవానిశిధర్‌రెడ్డి పుస్తెమెట్టెలను అందించారు. సోమవారం వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నాయకులు బంగారు మల్లయ్య, గుడ్ల ఆనందం, రవి, మహేందర్, సురేష్, విజేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ కనుకయ్య, కారోబార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌లకు సన్మానం

దేవరుప్పుల: మండలంలోని నీర్మాల గ్రామ పంచాయతీ పాలకవర్గానికి జెడ్పీటీసీ పల్ల భార్గవి సుందర్‌రామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనసన్మానం చేసి జ్ఞాపికలను అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ కొత్త జలంధర్‌రెడ్డి, సంజీవరెడ్డి, మేడ వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, మేడ రామచంద్రు, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే రామరాజుపల్లి గ్రామ ప్రత్యేకాధికారిగా

సంక్షిప్త సమాచారం

విధుల్లో చేరిన వెటర్నటీ డాక్టర్ సింధుప్రియను గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం, కృష్ణ, సురేష్ తదితరులు కలిసి సన్మానించారు.

విద్యారంగాన్ని గాలికి వదిలేసిన ప్రభుత్వం



జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగాన్ని గాలికి వదిలేసింది.. కేవలం 9.1 శాతం నిధులు కేటాయించడమే ఇందుకు నిదర్శనమని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. ఇందుకు నిరసనగా జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ వద్ద సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యాన విద్యార్థులతో చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యాకన్న, అంజలి, స్రవంతి, రవికిషోర్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ గ్రామంలో నిరుపేద లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాల పట్టాలు అందించి ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గాదె శ్రీధర్ కోరారు. ఈ మేరకు మండలంలోని నమిలిగొండలోని ఇళ్ల స్థలాల లబ్ధిదారులు తమకు పట్టాలు అందించాలని కోరుతూ లబ్ధిదారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు.

మాక్ జెడ్పీ సమావేశం

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మేడారం జాతరను పురస్కరించుకొని మాక్ జిల్లా పరిషత్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడారం జాతరలో చేపట్టాల్సిన పలు అంశాలపై సమావేశంలో తీర్మానాలు చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

దేవరుప్పుల: మండలంలోని ధరావత్‌తండాలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి మహోత్సవ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సేన జిల్లా కార్యదర్శి లావుడ్యా అనిల్ చౌహాన్ నాయక్, భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ధరావత్ స్వామి నాయక్ పాల్గొని మాట్లాడారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

పాలకుర్తి టౌన్ : మండలంలోని బమ్మెర ప్రభుత్వం పాఠశాలకు కొత్తోజు నాగచారి మైక్‌సెట్, సౌండ్ సిస్టంను సోమవారం బహూకరించారు.

ఎల్లమ్మగడ్డ తండాను ప్రత్యేక జీపీ చేయాలి

పాలకుర్తి టౌన్: గిరిజనులకు అనుకూలంగా ఉన్న తండాలను అయ్యగారిపల్లి గ్రామం నుంచి విడదీసి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని సోమవారం గిరిజనులు కలెక్టర్ శివలింగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రమేష్, నరేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి మేడారానికి బస్సులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ నుంచి మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు ఈనెల 18 నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయని ఘన్‌పూర్ ఆర్టీసీ కంట్రోలర్ రఘువీర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న పిచ్చిచెట్లు, చెత్తాచెదారం తొలగించి స్థలాన్ని చదును చేసే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘన్‌పూర్ నుంచి మేడారం వెళ్లే బస్సులు నిలిపేందుకు బస్టాండ్ ఆవరణలోని స్థలాన్ని శుభ్రం చేయిస్తున్నామన్నారు.


కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

బచ్చన్నపేట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టి బొమ్మను మండలంలోని బండనాగారం గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో సోమవారం కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు జిల్లెల్ల దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ నల్లగొండలో కృష్ణా జలాలపై ఏర్పాటు చేసిన బహిరంగ సభను నిరసిస్తూ ఆయన దిష్టి బొమ్మను దహనం చేసినట్లు తెలిపారు.

దురాక్రమణను నిలువరించాలని వినతి

దేవరుప్పుల: మండలకేంద్రంలోని కొత్తవాడలో నిలువనీడలేని పేదల కోసం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను అనర్హులు దురాక్రమణ చేశారని ఉప్పుల మహేష్ అన్నారు. ఈ మేరకు దురాక్రమణను నిలువరించాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు.

అబాకస్‌లో ప్రశాంతి విద్యార్థుల ప్రతిభ



దేవరుప్పుల: జనగామ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల స్థాయిలో జరిగిన అబాకస్ టాలెంట్ టెస్టులో మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంటు టి.పాండు కృష్ణ తెలిపారు. ఆదివారం జనగామ పట్టణంలోని సాన్ మారియా పాఠశాలలో మూడు జిల్లాల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో జూనియర్ విభాగంలో యామ.శివ (3వ తరగతి) మొదటి స్థానాన్ని, సీనియర్ విభాగంలో ఈదునూరి శ్రీహిత (5వ తరగతి) మూడవ స్థానాన్ని గెలుచుకున్నారు. వీరిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

'గృహజ్యోతి'ని వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత కరెంట్‌ను లబ్ధిదారులు వినియోగించుకోవాలని విద్యుత్ ప్రత్యేక అధికారి నాగబెల్లి ప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలో విద్యుత్ సిబ్బంది చేపట్టిన గృహజ్యోతి పథకానికి సంబంధించిన డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని సోమవారం పర్యవేక్షించారు.

గొడ్డలితో దాడి.. ఒకరికి తీవ్రగాయాలు

పాలకుర్తి టౌన్: భూ తగాదా విషయంలో గొడ్డలితో దాడి చేయడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం పాలకుర్తి మండలంలోని లక్ష్మీనారాయణపురంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుత్తి భిక్షపతిని అదే గ్రామానికి చెందిన మజ్జిగ యాదగిరి, అతని కుమారుడు మజ్జిగ వీరస్వామి ఇద్దరు కలిసి తలపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనగామ ఏరియా అస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు భిక్షపతిని హైదరాబాద్‌లోని నిమ్స్ అస్పత్రికి తరలించిన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన సోమవారం మండలంలోని విస్నూరులో చోటు చేసుకుంది. విస్నూరు గ్రామానికి చెందిన బాలగాని భిక్షపతి తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. గాయాలైన భిక్షపతి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందజేయాలని గౌడ జనహక్కులు పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల వెంకటేశ్వర్లుగౌడ్, విస్నూరు ఎంపీటీసీ మాటూరి యాకయ్య,బాలగాని నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు.

ఆవులు మృతి

బచ్చన్నపేట: మండలంలోని గంగాపూర్‌లో అకస్మాత్తుగా ఇద్దరు రైతుల పాడి ఆవులు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతులు బందారం మహేందర్, పిట్టల శ్రీహరికి చెందిన ఆవులు ఒక రోజు మేత మేయలేదు. దీంతో మండల పశువైద్యాధికారులకు ఫోన్ చేయగా వారు స్పందించలేదు. అందుబాటులో ఉన్న ప్రైవేట్ డాక్టర్లకు చూపించి వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో ఆవులు మృతిచెందాయి. ఒక్కో ఆవు విలువ సుమారు. 70 వేలు ఉంటుందని, ఇన్‌చార్జ్ వైద్యులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పర్మనెంట్ పశువైద్యాధికారిని నియమించాలని పలువురు రైతులు కోరుతున్నారు.